సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 13 । మార్చి । 2025



కృత్రిమ మేధస్సుతో..

చదువులో వెనుకబడిన పిల్లలకు కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన మేలు చేస్తుందని పీఓ రాహుల్ అన్నారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.24

సహర్ (శుక్రవారం ఉ॥) 5.02

వాతావరణం

గరిష్టం / కనిష్టం 41°/ 21°

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం... కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక బుధవారం వేద పండితులు కమనీయంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 14న చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలోని యాగశాలలో శుక్రవారం హోమ పూజలు జరపనున్నారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు షురూ..



పూజలు చేస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆరాధన, పుణ్యావాచకం తదితర పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌చార్జి మేనేజర్ పగడాల వెంకటరమణ పర్యవేక్షించారు.

రుణ లక్ష్యాలు పూర్తి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపులోగా ప్రాధాన్యతరంగ రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన 2024–25 ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో మాట్లాడారు. అర్హులకు సకాలంలో రుణాలు ఇవ్వడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై సమీక్షించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి నాబార్డు సిద్ధం చేసిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. కాగా జిల్లాలో వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు, మార్కెటింగ్, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలకు రూ.4,883.98 కోట్లు ఖర్చు చేయనున్నట్లు నాబార్డు అంచనా వేసింది. అధికారులు విద్యాచందన, సుజిత్ కుమార్, సాయిచరణ్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

డీఈఈటీలో వివరాలు నమోదు చేయాలి

డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఈఈటీ యాప్‌పై అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డీఈఈటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, దీనిలో వివరాలు నమోదు చేస్తే నైపుణ్యం, అర్హతల ఆధారంగా ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయన్నారు. అధికారులు డేవిడ్‌రాజు, తిరుపతయ్య, రామ్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హస్తంలో మల్లగుల్లాలు!



ములకలపల్లి మండలం వీకే రామవరంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ రెండో పంప్‌హౌస్(ఫైల్)

గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టారు. దుమ్ముగూడెం ఆనకట్ట ఆధారంగా రాజీవ్ సాగర్ ఉండగా, కొత్తగా వేలేరుపాడు మండలం రుద్రంకోట కేంద్రంగా ఇందిరాసాగర్ నిర్మించేలా డిజైన్ చేశారు. వీటికి సంబంధించి కొంతమేర పనులు చేపట్టాక రాష్ట్ర విభజన జరిగింది. దీంతో ఇందిరాసాగర్ ప్రాంతం పూర్తిగా ఏపీ పరిధిలోకి వెళ్లిపోయింది. తెలంగాణ ఏర్పడ్డాక ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్‌లను రద్దు చేస్తూ కొత్తగా సీతారామ బహుళార్థ సాధక ఎత్తిపోతల పథకానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. –సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సీతారామ ఎత్తిపోతల పథకం పేరు మార్పు యోచన?

- ఇందిరా/రాజీవ్ పేరు పెట్టాలని కాంగ్రెస్ ముఖ్యనేతల్లో చర్చ
- వైఎస్ హయాంలో రాజీవ్, ఇందిరాసాగర్‌లు ప్రారంభం
- తెలంగాణ వచ్చాక సీతారామగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం

తొమ్మిదేళ్లుగా...

సీతారామ ప్రాజెక్ట్ పనులు 2016లో మొదలైతే తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటివరకు పూర్తికాలేదు. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉన్నపళంగా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించేందుకు రాజీవ్ సాగర్ లింక్ కెనాల్‌ను ప్రతిపాదించింది. ఏడాది కాలంలో ఈ కాలువ పనులు పూర్తి చేశారు. దీంతో తొలిసారిగా సాగర్ ఆయకట్టుకు ఈ నెల 5న గోదావరి జలాలను తరలించారు. మరోవైపు గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 8 వేల కోట్ల నుంచి రూ. 13 వేల కోట్లకు పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అంచనా వ్యయాన్ని రూ.19 వేల కోట్లకు సవరించాల్సి వచ్చింది.

ఫాయిదా వచ్చేనా ?

ఉమ్మడి ఖమ్మం జిల్లా అనాదిగా భద్రాచల సీతారాముల పేరుతోనే ప్రసిద్ధి పొందింది. తానీషా కాలం నుంచి నేటి ముఖ్యమంత్రుల వరకు సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారామ పేరు ఈ జిల్లాకు సెంటిమెంట్‌తో ముడిపడిన అంశంగా ఉంది. ఇప్పుడు ప్రాజెక్టు పేరులో మార్పులు చేస్తే ఫలితాలు ఎంత మేరకు సానుకూలంగా ఉంటాయనే అనుమానాలు కూడా అధికార పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి.

రాజీవ్ కెనాల్ తరహాలో

సీతారామ ప్రాజెక్టు స్వరూప స్వభావాల్లో ఎలాంటి మార్పులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా లింక్ కెనాల్‌ను తెర మీదకు తెచ్చింది. దీనికి రాజీవ్ లింక్ కెనాల్ అని పేరు పెట్టగా, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. పైగా కాంగ్రెస్ శ్రేణుల నుంచి హర్షాతిరేకాలు వచ్చాయి. ఇదే తరహాలో సీతారామ పేరు మార్చకుండా భవిష్యత్‌లో ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా చేపట్టబోయే ఇల్లెందు నియోజకవర్గ మాస్టర్ ప్లాన్‌కు రాజీవ్/ఇందిరా సాగర్‌ల పేరును పరిశీలిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయాలు ఇంజనీరింగ్ వర్గాల నుంచి వస్తున్నాయి. పైగా సీతారామకు సంబంధించిన తొలి శంకుస్థాపన సైతం ఇల్లెందు నియోజకర్గంలోనే జరిగింది. కానీ తర్వాత మార్పుల్లో ఈ నియోజకవర్గాన్ని సీతారామ లబ్ధిదారుల జాబితా నుంచి దాదాపుగా మినహాయించారు.

అనుబంధ పనులు

ప్రస్తుతం సీతారామలో ఎక్కడా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేదు. రోళ్లపాడు దగ్గర 10 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించే అంశంపైనా ప్రస్తుత ప్రభుత్వం చర్చ చేసింది. దీంతోపాటు సీతారామ ద్వారా నీరు అందని భద్రాచలం, తక్కువ ప్రయోజనం పొందే పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాల కోసం కొత్తగా ఎత్తిపోతలు చేపట్టే ప్రతిపాదనలు ఉన్నాయి. సీతారామకు అనుబంధంగా చేపట్టబోయే పనులు అనేకం ఉన్నందున, వాటికి కొత్తగా పేర్లు పెట్టడం ద్వారా స్వామికార్యం, స్వకార్యం రెండూ జరిగిపోతాయనే చర్చ హస్తం పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

పేరుపై చర్చ

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ పేర్లతో చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రద్దు చేసిందనే అభిప్రాయాన్ని ప్రస్తుత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. డీపీఆర్‌కు అనుమతులు సాధించడం మొదలు భారీ స్థాయిలో నిధులు సైతం తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్నందున, సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు గతంలో ఉన్న ఇందిరాసాగర్ లేదా రాజీవ్‌సాగర్ పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ఎలా ఉంటుందనే చర్చ ఇటీవల ముఖ్యనేతల మధ్య జరిగినట్టు సమాచారం.

జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి



ఇంకుడు గుంత తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జలసంచయ్ జన్ భగీదారి క్యాచ్ ది రైన్ అమలులో జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. హమాలీకాలనీలో జల సంచయ్ కార్యక్రమం అమలులో భాగంగా బుధవారం కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంతను తవ్వారు. స్థానిక యువకులతో మమేకపై నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణాల్లో అగ్రస్థానంలో ఉండాలని పేర్కొన్నారు. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి పెరుగుతుందని అన్నారు. భవిష్యత్‌లో నీటి ఎద్దడి లేకుండా ప్రతి నీటి బొట్టు వృథా కాకుండా చూడాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి

చుంచుపల్లి: జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనలతో కలిసి ఉపాధి హామీ పథకం అమలు, ఆస్తి పన్ను వసూలు, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై మండల స్థాయి, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూలీలకు వంద పని దినాలు కల్పించాలని, ఈ నెల 31 లోపు వందశాతం ఉపాధి పనులు పూర్తి చేయాలన్నారు. బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల జాబితా తయారు చేయాలని, వ్యవసాయ భూమిలో ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని వివరించారు. యువతను భాగస్వామ్యం చేస్తూ అన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ నెల 15 లోగా ఆస్తి పన్ను బకాయిల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. బకాయిలు చెల్లించనివారి పేర్లు ఫ్లెక్సీల ద్వారా గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని, లేదా ఇంటిముందు డప్పులు వాయించాలని కలెక్టర్ తెలిపారు. ధరణి, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎల్–1 జాబితా శనివారంలోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖ అధికారులు చంద్రమౌళి, శంకర్, వెంకటేశ్వరాచారి, బాబూరావు, శ్రీనివాసరావు, తిరుమలేష్, నళిని, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతో అధిక దిగుబడులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్ర వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. రామవరం రైతువేదికలో బుధవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన వాలంతరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బృందంతో ఏఈఓలకు, రైతులకు నీటినిర్వహణ, మట్టి, నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండురోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి, ప్రస్తుత పంటల సమస్యలు, పరిష్కారంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, వ్యవసాయ సంచాలకులు నరసింహారావు, వాలంతరీ డైరెక్టర్ విజయగౌరి, ఏడీఏ సునీత తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు గోటి తలంబ్రాలు



దమ్మపేటలో గోటి తలంబ్రాలతో సీతారామ భక్త కమిటీ సభ్యులు

దమ్మపేట: దమ్మపేట గ్రామానికి చెందిన మహిళలు 8 లక్షల 11 వేల గోటి తలంబ్రాలను రామయ్య కల్యాణానికి సిద్ధం చేశారు. శ్రీసీతారామ భక్త కమిటీ ఆధ్వర్యంలో మహిళలు చేతి గోళ్లతో ఒలిచి తలంబ్రాలను తయారు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజు ఈ కార్యక్రమం ప్రారంభించి బుధవారం నాటికి పూర్తి చేశారు. వీటిని భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయంలో సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సీతారామ భక్త కమిటీ అధ్యక్షురాలు మురహరి గంగ, సభ్యులు సత్యవతి, సరస్వతి, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా భద్రాచలం..

జూలూరుపాడు: ,భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గోటి తలంబ్రాలను సమర్పించేందుకు బుధవారం పలువురు రామభక్తులు పాదయాత్రగా వెళ్లారు. ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడ, జూలూరుపాడు, వెంగన్నపాలెం, అనంతారం, తదితర గ్రామాల రామభక్తులు నెల రోజులుగా గోటి తలంబ్రాలను ఒలిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగే శ్రీసీతారాముల కల్యాణమహోత్సవానికి గోటి తలంబ్రాలను సమర్పించేందుకు పాదయాత్రగా వెళ్లారు.

ఏదీ ఆహ్లాదం..?

- అస్తవ్యస్తంగా మారిన పట్టణ ప్రకృతి వనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా పార్కులు
- వాకింగ్ ట్రాక్‌ల్లో వెలసిన పుట్టలు, పేరుకుపోయిన చెత్తాచెదారం
- కొరవడిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ





కొత్తగూడెంలో చెత్తాచెదారంతో నిండిన పట్టణ ప్రకృతివనం (ఇన్‌సెట్) నిరుపయోగంగా మారిన పార్కు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీల్లో నివసించే ప్రజలు నిత్యం కాలుష్య సమస్యతో సతమతమవుతుంటారు. వాహనాల రద్దీ, వాటి నుంచే వచ్చే పొగ, పరిశ్రమల నుంచి వ్యర్థాలు, వాసనలతో కూడిన గాలి పీల్చుకుంటూ అనారోగ్యం బారిన పడుతుంటారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదం అందించేందుకు గత ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణలోపంతో అవి ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. విషసర్పాల పుట్టలకు నిలయంగా మారాయి. విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలు విరిగిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయి కళావిహీనంగా తయారయ్యాయి. రాత్రి వేళల్లో కొందరు వనాల్లో మద్యం తాగుతున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్వహణను పట్టించుకోవడం లేదు. పట్టణాల్లో శానిటేషన్ పనులు చేసేందుకే సిబ్బంది సరిపోవడం లేదని, ఇక పట్టణ ప్రకృతి వనాల్లో పనులు ఎలా చేస్తారని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పట్టణ వనాలు నిరుపయోగంగా మారాయి. పుట్టలు పెరిగిపోయి వాటి నుంచి జనావాసాల్లోకి పాములు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముళ్ల పొదలతో..

పట్టణ ప్రకృతి వనాల్లో సేద తీరే పండ్ల చెట్లు, సుందరీకరణ మొక్కలు, నీడనిచ్చే చెట్లు, వేప, రావి, మర్రి కానుగ, బాదం వంటివి మొక్కలను పెంచారు. పూల, ఔషధ, ఉసిరి, నేరేడు, సీమచింత, కరివేపాకు, జామ వంటి మొక్కలు కూడా నాటారు. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో నిర్వహణ బాధ్యత పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించారు. కానీ రెండేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పిచ్చిచెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయాయి.

ఎండిపోతున్న మొక్కలు

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రకృతి వనాలు ప్రజలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో మున్సిపాలిటీలో 10 నుంచి 20 వరకు పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో 16, పాల్వంచలో 18, ఇల్లెందులో ఆరు, మణుగూరులో 8 పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇవన్నీ అధ్వానంగా మారాయి. నీరులేక మొక్కలు ఎండిపోతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించి నిర్వహణ మెరుగుపరిచి ప్రజలకు ఆహ్లాదం పంచేలా పట్టణ ప్రకృతి వనాలను మార్చాలని పలువురు కోరుతున్నారు. పట్టణ ప్రకృతి వనాలపై కొత్తగూడెం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. స్పందించలేదు.

అధికారుల పర్యవేక్షణ కరువు



ఆదరణ కోల్పోతున్న కొత్త కాలనీలోని చిల్డ్రన్స్ పార్క్

ఇల్లెందు: పట్టణంలోని కొత్తకాలనీలో ఆరు నెలల క్రితం రెండెకరాల విస్తీర్ణంలో ప్రారంభించిన చిల్డ్రన్స్ పార్కు అస్తవ్యస్తంగా మారింది. రూ. 1.36 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పార్క్ ఏర్పాటు చేశారు. ఆహ్లాదం కోసం గార్డెన్, జిమ్, వాకింగ్ ట్రాక్, బల్లాలు తదితర సౌకర్యాలు కల్పించారు. సోలార్ లైటింగ్, నీటి కోసం బోర్లు, మోటార్లు అందుబాటులోకి తెచ్చారు. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడి పార్క్ చెత్తాచెదారంతో నిండిపోయింది. మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం రెండు నెలల క్రితం ముగిసింది. అప్పటి నుంచి అధికారుల్లో నిర్లిప్తత ఏర్పడింది. నీరులేక మొక్కలు ఎండిపోతున్నాయి. శానిటేషన్ లేకపోవటంతో చిన్నారులు ఆటపాటలకు వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కు నిర్వహణపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఎస్పీ రోహిత్‌రాజు



కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. బుధవారం హేమచంద్రాపురంలో ఉన్న పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన నేరు సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేయాలని ఆదేశించారు. అనంతరం వర్టికల్ విభాగంలో ప్రతిభ చాటిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, రవీందర్, సతీష్‌కుమార్, మల్లయ్యస్వామి, సీఐలు శ్రీనివాస్, రమాకాంత్, నాగరాజురెడ్డి, ఎస్సైలు హారిక, హసీనా పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్



నియామక పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్ఓ

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. డయాలసిస్ వార్డును పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ, ఇతర వార్డులను తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న పోస్టుమార్టం భవనం, నిర్మాణం పూర్తయిన సీఎస్ఆర్ భవనాలను పరిశీలించారు. అనంతరం అశ్వారావుపేటలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫీజు వివరాలను బోర్డుల్లో ప్రదర్శించాలని, ప్రైవేటు ఆస్పత్రుల్లో పరిమితికి మించి వైద్యం చేయవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డీఐఓ బాలాజీ నాయక్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణీ, వైద్యులు విజయ్‌కుమార్, వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు రాందాస్, విజయ్ కుమార్, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కుష్ఠు రహిత జిల్లా కోసం సమష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు జరిగే కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన ఆశాకార్యకర్తలు, యూనియన్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. అనుమానిత వ్యక్తులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. కాగా జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భర్తీ చేసిన 9మంది ఆయుష్ ఫార్మసిస్ట్ అభ్యర్థులకు బుధవారం డీఎంహెచ్ఓ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి.బాలాజీ, భద్రు, శ్రీనివాస్, రాంప్రసాద్, యూనియన్ నాయకులు రవికుమార్, ఝాన్సీ, విజయలక్ష్మి, లత, సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి భానుమతి

అశ్వారావుపేటరూరల్: అనాథ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి అన్నారు. బుధవారం మండలంలోని వినాయకపురం గ్రామంలో పిల్లల అనాథ ఆశ్రమాన్ని ఆమె సందర్శించారు. ఆశ్రమంలో సౌకర్యాలు, వంట గదులు, స్టోర్ రూం, రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రామ్మూర్తి, పి.నిరంజన్‌రావు, ధనుష్, కోటి పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టడీ టూర్‌తో విజ్ఞానం

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టడీ టూర్ నిర్వహించడం వల్ల చదువుతోపాటు విజ్ఞానం, మేధాశక్తిని పెరుగుతుందని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల సీనియర్ ఫ్యాకల్టీ, లైజన్ అధికారి లక్ష్మి అన్నారు. విద్యార్థుల బృందం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని విభాగాలు, మొబైల్ కోర్టు, గిరిజన మ్యూజియాన్ని బుధవారం సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. మొబైల్ కోర్టు ద్వారా గిరిజనుల భూములకు సంబంధించిన విషయాలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారని చెప్పారు. అనంతరం విద్యార్థుల బృందం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుంది.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

సింగరేణి(కొత్తగూడెం): ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో సింగరేణి పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత జనవరి 30న నిర్వహించిన ఒలింపియాడ్‌లో కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలల నుంచి 114 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది బంగారు పతకాలు సాధించారు. ముగ్గురు విద్యార్థులు రూ.2 వేలు క్యాష్ అవార్డు సాధించారు. మణుగూరు పాఠశాలల నుంచి 84 మంది విద్యార్థులు పాల్గొనగా, 13 మంది బంగారు పతకాలు, ఇల్లెందు నుంచి 30 మంది బంగారు పతకాలు సాధించగా.. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సునీల్‌కుమార్, ఛీఫ్ కోఆర్డినేటర్ ఫూల్‌సింగ్ విద్యార్థులను అభినందించారు.

సింగరేణిలో ప్యానల్ అడ్వకేట్ల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ప్యానల్ అడ్వకేట్లను నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. వీరు సింగరేణికి చెందిన కేసులను రీజియన్ పరిధిలో వాదించేందుకుగా యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో వెల్లంకి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి పరిధిలో రమేశ్‌కుమార్‌మక్కడ్, మణుగూరు పరిధిలో జీవీకే మనోహర్, ఇల్లెందు పరిధిలో ఎస్.మల్లికార్జున్‌ను యాజమాన్యం నియమించింది.

కృత్రిమ మేధస్సుతో బోధన మేలు

బూర్గంపాడు: చదువులో వెనుకబడిన పిల్లలకు కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన చేయడం ఎంతో ఉపకరిస్తుందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ అన్నారు. బుధవారం సారపాక గాంధీనగర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చదువులో వెనుకబడిన పిల్లలను గుర్తించి అభ్యాసన మెరుగుపడటానికి స్థాయిని అంచనా వేయడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని గాంధీనగర్ పాఠశాలలో ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎదు నర్సింహారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, గోపాల్‌రావు, శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని గుట్ట లక్ష్మీపురం గ్రామంలోని అభ్యుదయ రైతు సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పుచ్చ, మిరప, జామ పంటలను ఐటీడీఏ పీఓ రాహుల్ పరిశీలించారు. రూ.20 లక్షల ఖర్చుతో 20 ఎకరాల్లో పుచ్చకాయ పంట సాగు చేయడంతో పాటు కోత్‌కతా నుంచి వచ్చిన ఈ–మ్యాక్స్ విత్తనంతో కేవలం 70 రోజుల్లో దిగబడి రావడం గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీ ఉదయ్‌భాస్కర్, హెచ్‌ఓ వేణుమాధవ్ తదితరులు ఉన్నారు.



బూర్గంపాడు: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే చదువుపై ఆసక్తి పెంచుకొని ఉన్నతంగా ఎదగాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వంట, వసతి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రాథమిక తరగతుల నుంచి విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామని, ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు భవిష్యత్ ప్రణాళిక అవసరమని, అందుకోసం కెరీర్ గైడెన్స్ పేరుతో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏటీడీఓ సూర్నపాక రాధ, హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

జూలూరుపాడు: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మహేందర్ అన్నారు. బుధవారం కాకర్ల గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మహేందర్ మాట్లాడారు. కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ఆటో స్టార్టర్లు పెట్టడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. అక్రమంగా వ్యవసాయ మోటార్లు నడుపుతున్న రైతులు తప్పనిసరిగా విద్యుత్‌శాఖకు డబ్బులు చెల్లించి రశీదు తీసుకొని సర్వీస్ రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఎస్‌ఈ పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పడమట నర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ టౌన్ ఫీడర్‌ను ఎస్‌ఈ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ రంగస్వామి, ఏడీఈ రవికుమార్, జూలూరుపాడు ఏఈ సతీశ్, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎస్.భాస్కర్‌రావు, రైతులు అల్లాడి నరసింహారావు, వందనపు సత్యనారాయణ, చావా వెంకటరామారావు, అల్లాడి లింగారావు, చావా కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

గాయనికి అవార్డు

టేకులపల్లి: విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం మండలానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యురాలు గుగులోత్ నీలకు అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీల చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం సాంస్కృతిక సారథి విభాగంలో ఆమెకు ఉద్యోగం కల్పించింది. అందులో ఆమె ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. మండలంలోని 9వ మైలుతండాకు చెందిన నీలను పలువురు అభినందించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- భర్తను హత్య చేయించిన భార్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

పాల్వంచ: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడంటూ భర్తను హత్య చేయించిన భార్యతో పాటు ఈ ఘటనలో భాగస్వాములైన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో బుధవారం చోటుచేసుకుంది. ఈ మేరకు డీఎస్పీ సతీష్‌కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పేట చెరువు గ్రామానికి చెందిన పెయింటర్ పుట్టల నరేష్(33) ఫిబ్రవరి 11న మృతిచెందాడు. అయితే కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేసిన తల్లి పుట్టల చుక్కమ్మ గతనెల 17న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు.. స్మశాన వాటికలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి, పోస్ట్‌మార్టం చేయించారు. దర్యాప్తులో లభించిన శాస్త్రీయ ఆధారాలతో కేసుతో సంబంధం ఉన్న పినపాక మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన గద్దల సాంబశివరావు, అతని స్నేహితుడు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం సూరవీడు కాలనీకి చెందిన తాటి నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. నరేష్ భార్య రజిత సాంబశివరావుకు మరదలు వరుస కావడంతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నారు. విషయం తెలిసిన నరేష్.. రజితను ఇబ్బంది పెడుతుండగా సాంబశివరావుకు చెప్పడంతో అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ వేశారు. ఫిబ్రవరి 10వ తేదీన నరేష్, రజిత సారపాకలోని తమ బంధువుల ఇంటికి వెళ్లగా సాంబశివరావు తాటి నరేష్ సహాయంతో పుట్టల నరేష్‌కు మద్యంలో పురుగుల మందు కలిపి తాగించారు. దీంతో అస్వస్థతకు గురైన నరేష్ 11వ తేదీన మృతి చెందాడు. నిందితులు నేరం అంగీకరించడంతో గద్దల సాంబశివరావు, తాటి నరేష్, పుట్టల రజితపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సతీష్, ఎస్‌ఐలు సుమన్, కల్యాణి పాల్గొన్నారు.

చోరి కేసులో ముగ్గురి అరెస్ట్

రూ.7,19,000 నగదు, అర తులం బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

సుజాతనగర్: మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ, హలావత్‌తండాలో ఈ నెల 7వ తేదీన జరిగిన చోరీ కేసులో పోలీసులు బుధవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. హలావత్‌తండాకు చెందిన జర్పుల కిషన్ ఇంట్లో ఈ నెల 7న తలుపులు, బీరువా పగలగొట్టి 5,20,000 నగదుతో పాటు అర తులం బంగారాన్ని కొందరు ఎత్తుకెళ్లారు. కిషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఎస్‌ఐ ఎం.రమాదేవి వేపలగడ్డ వద్ద బుధవారం వాహన తనిఖీ చేపట్టగా హలావత్‌తండాకు చెందిన జర్పుల నరేశ్ పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. తన బాబాయి అయిన జర్పుల కిషన్ ఇంట్లో తాను చోరీ చేశానని నరేశ్ అంగీకరించాడు. చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, కొత్తగూడెం ప్రాంతాల్లో పలు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్లను కూడా చోరీ చేశాడని, కాపర్ వైర్లను అతడి వద్ద కొనుగోలు చేసిన మధురబస్తీకి చెందిన బెల్లంకొండ ఈశ్వర్‌రావు, పాల్వంచకు చెందిన కొంచాడ సత్యం కూడా అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. నరేశ్ వద్ద నుంచి రూ.5 లక్షల నగదుతో పాటు మొబైల్, ఈశ్వర్‌రావు వద్ద నుంచి రూ.19 వేలు, సత్యం వద్ద నుంచి రూ.2 లక్షల నగదును రికవరీ చేసి ముగ్గురిని అరెస్ట్ చేశామని డీఎస్పీ రెహమాన్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఐ రాయల వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

మణుగూరుటౌన్: కొంతకాలంగా ఇళ్ల వద్ద వేసిన బోరు మోటార్లు చోరీకి గురవుతున్న నేపథ్యంలో కేసు నమోదు చేసిన మణుగూరు పోలీసులు బుధవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ సతీశ్‌కుమార్ కథనం ప్రకారం.. 15 రోజుల కిందట మండలంలోని ముత్యాలమ్మనగర్, మద్దులగూడెం, వాగు మల్లారం ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న నివాసాల వద్ద వేసిన బోర్ల నుంచి మోటార్లను చోరీచేస్తున్నారని, ఎస్‌ఐ ప్రసాద్, వీర, రామారావు, షమీం ప్రత్యేక బృందంగా ఏర్పడి సీసీ కెమెరాలు, నిందితుల కోసం గాలిస్తుండగా బుధవారం నలుగురిని పట్టుకుని విచారించగా లంకమల్లారంనకు చెందిన రాయలరాజు(ప్రైవేట్ ఎలక్ట్రీషియన్), వాగు మల్లారంనకు చెందిన పుట్ట సందీప్, కార్పెంటర్ పోలోజు నర్సింహారాచారి, తాపీమేస్త్రి పొడుగు దయాకర్‌గా తేలిందన్నారు. వీరు మోటార్లు చోరీ చేసి మంగపేట, బయ్యారం మండలాల్లో విక్రయిస్తున్నట్లు అంగీకరించారని చెప్పారు. మోటార్ల విలువ రూ.1.35 లక్షలు ఉటుందని, వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. కాగా, సీఐతోపాటు ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

జాతరకు వెళ్లి వస్తూ దుర్మరణం

కుటుంబంలో విషాదం నింపిన రోడ్డుప్రమాదం



గోపి మృతదేహం

అశ్వారావుపేటరూరల్: జాతర ఉత్సవాలకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం శివగిరి గ్రామానికి చెందిన నడికుదురు గోపి (32), స్నేహితుడు అర్జున్‌రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి జీలుగుమిల్లిలో జరుగుతున్న జగదాంబ తల్లి జాతరకు వెళ్లారు. తిరిగి తాను నివాసం ఉంటున్న ఏపీలోని జీలుగుమల్లి మండలం రాచన్నగూడేనికి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట మీదుగా వెళ్తున్న క్రమంలో స్థానిక కాకతీయ గేట్ సమీపంలో కాకినాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపి అక్కడికక్కడే దుర్మరణం చెందగా వెనుక కూర్చున్న అర్జున్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి తండ్రి నరసింహారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జాతరలో సరదాగా గడిపిన గోపి.. ఇంటికి వస్తున్న క్రమంలో మృతిచెందటంతో వారి కుటుంబంలో విషాదం నింపింది.

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

పాల్వంచరూరల్: భార్యతో గొడవ పడిన భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పాండురంగాపురం శివారులోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన మడివి దేవయ్య (38) మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

తాటి చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు మోటపోతుల అప్పారావు (40) బుధవారం తాటిచెట్టు పైనుంచి కిందపడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. పోలారం గ్రామానికి చెందిన అప్పారావు మర్రిగూడెం గ్రామ పంచాయతీ రామకృష్ణాపురంలో గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కిన అప్పారావు ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. చెట్టుకింద ఉన్న కొయ్యలు గుచ్చుకోవడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు: తంబోలా ఆడుతూ పట్టుబడిన ఐదుగురిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కప్పలకుంట చెరువు సమీపంలో కొందరు ప్రభుత్వం నిషేధించిన తంబోలా ఆడుతున్నారనే సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుళ్లు దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

105 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అదే గ్రామానికి చెందిన చక్రాల నరసింహారావు రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొని తన ఇంట్లో నిల్వ ఉంచారు. లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి దాడిచేసి బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. కారుకొండ రామవరం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు.

ఇల్లెందురూరల్: అక్రమంగా నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపురం, ఇల్లెందులపాడు, నంబర్–2 బస్తీ, మండలంలోని ముకుందాపురంలో పౌరసరఫరాలశాఖ డీటీ పాషా దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, ముగ్గురిపై కేసు నమోదు చేశార.